# యేం తప్పు ?

భీ. తప్పేమిటి ?

యిట్లారా

చీకటి వెలుతురుతో మెరుగుపెట్టినట్లు, నీ జుట్టుమీద చెయ్యేసి, నీ సన్నని, తెల్లని, మెత్తని చెంపల్ని తాకడం తప్పా ?

చీకట్లో మలయమారుతం మీద తేతే మబ్బుకి, వెలుతురు వొకపక్క మెరుగుపెడితే, దాన్ని తాకాలనుకోవడం తప్పా ?

యెందుకూ నవ్వుతావు ? నా మాటలకేనా ? నీ ముఖం వెలిగించి, అదృశ్యమయ్యే ఆ చిరునవ్వును నా ముద్దులతో అట్లానే, యెర్రని పెదిమలమీద ఆపనా ?

అదీ తప్పే ? యేం ?

అస్తమించే సూర్యుడు యెర్రచేసిన మబ్బులోంచి కనపడే, అర్ధచంద్రుణ్ణి, అక్కడే ఆపి ఆ సౌందర్య మనుభవించాలనుకుంటే తప్పా ?

యిట్లారా.

లోకపు నిందలతో, చివాట్లతో, అలిసి, దిమ్మెక్కిన యీ తలని, నీమీద ఆనించుకొని పరవశత్వం పొందనీ !

తప్పంటావా ?

ప్రేమ జలభారంతో బరువెక్కి వొంపుతీరిన ధవళారుణ పయోధరము మీద వొకసారి తలనానించుకొందామని కోర్కెపడడం తప్పేనా ?

వెడుతున్నావేం ? పోనీను. యెందుకు తప్పో చెప్పి మరీ కదులు.

పోకుండా, నా రెండు చేతులతో నీమృదు శరీరాన్ని నలిగి బొయ్యేట్టు కావిలించుకొని, అట్లా పెట్టేసుకుంటాను.

యిది తప్పులేదు.

పరిగెత్తే, తెల్లని, మెత్తని, వెన్నవంటి, బూరుగ దూదివంటి కార్తీకమబ్బును కావిలించుకుని, చల్లగాలి వీచే మర్రిచెట్టు నీడలోకి తెచ్చుకుందామనుకోడం ఏమీ తప్పులేదు, నాకు తెలుసు.

ఏదీ మొహం ? తిప్పివేశావేం? ఇట్లా తిప్పుకుంటాను. కళ్ళల్లో నీరే ! ఎందుకు ?

పోనీ గాని, ఆ నీరు నా పెదిమలతో తుడిచి, ఆ మెరిసే పాపల్లో అనంతమైన సౌందర్య స్వర్గాన్ని చూడనీ !

దీంటో తప్పేముంది ?

కాంతులు చిమ్మే శుక్రుడిమీద చిరుమబ్బు కమ్మితే దాన్ని తుడిచి ధగధగ మనే నా కోర్కెవలె మండే, ఆ ప్రేమలోకపు కాంతిని అనిమిషుడనై చూడ్డానికి ఆశపడడం తప్పుకాదు.

ఛీ ! తప్పు కానేకాదు.

తల పైకెత్తి నీలాంబరాన స్వచ్ఛందంగా గాలిలో విహరించే మేఘాలను చూడలేని అర్థాంధులకు తప్పు, మనకేమి తప్పు ?

నక్షత్రాల మధ్య వుండే అగాధమైన లోతుల, గాఢమైన అనంతాన్ని స్పృశించి అమరత్వం పొందిన నీకూ నాకూ తప్పేమిటి ?

ఛీ! పిచ్చి ఇంకా నీకు.

ఈ నీతి లోకపు వాసనలు పోలేదా ?

ఎంత తప్పు ?

◆ ◆ ◆

*రచనాకాలం - **1924,** సెప్టెంబరు, సాహితి పత్రిక, **1957** పునర్ముద్రణ ప్రచురణ : **(చుక్కమ్మ కథల సంపుటి) దేశీప్రచురణలు,***